**Eenadu**

# ఇక రోజూ నియామకాలు

- ఒకట్రెండు రోజుల్లో కొత్త అభ్యర్థుల నమోదుకు అవకాశం
- అవసరమైతే ప్రత్యేక శిక్షణ
- తెలంగాణ నైపుణ్య విజ్ఞానాభివృద్ధి సంస్థ శ్రీకారం

ఈనాడు - హైదరాబాద్

**ప్రాంగణ నియామకాల్లో అవకాశం పోయిందని బాధపడక్కర్లేదు..**

**మా కాలేజీలో అసలు ప్రాంగణ నియామకాలే లేవన్న బెంగా అక్కర్లేదు..**

**కళాశాల చదువు పూర్తయ్యాక ఉద్యోగవేట కష్టమనీ అనుకోనక్కర్లేదు...**

గడువుతో సంబంధం లేకుండా... చిన్న, పెద్ద, మధ్యతరగతి కంపెనీలనే తేడా లేకుండా... 365 రోజులూ ఉద్యోగ నియామకాలు జరిగేలా తెలంగాణ నైపుణ్య విజ్ఞానాభివృద్ధి సంస్థ (టాస్క్) శ్రీకారం చుట్టింది. కంపెనీల వివరాలు, అందులోని ఉద్యోగాల సమాచారం, జీతభత్యాలు, నియామకానికి కావల్సిన అర్హతలు, నైపుణ్యాల గురించిన పూర్తి సమాచారం టాస్క్ తన వెబ్ సైట్‌లో ఉంచుతోంది. ఉద్యోగాలున్నాయని ముందుకొచ్చే కంపెనీల పూర్తి వివరాలను అన్నిరకాలుగా తనిఖీ చేసుకున్న తర్వాతే వాటిని వెబ్ సైట్‌లో ఉంచడానికి టాస్క్ అనుమతిస్తోంది. తద్వారా బోగస్ కంపెనీలు మోసం చేయకుండా జాగ్రత్తపడుతోంది. "ఈ మధ్యకాలంలో ప్రాంగణ నియామకాల్లోనూ కంపెనీలు మోసాలకు పాల్పడుతున్నాయి. ఐటీల్లో కూడా ఉద్యోగాలకు హామీ ఇచ్చి మొండిచేయి చూపిన సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. అందుకే జాగ్రత్తగా ఉంటున్నాం" అని టాస్క్ అధికారి ఒకరు తెలిపారు. ఇప్పటికే ఇంజినీరింగ్ పూర్తయి... టాస్క్‌లో నమోదుగాని విద్యార్థులు తమ వివరాలు నమోదు చేసుకోవటానికి, తద్వారా ఈ కంపెనీల్లో ఉద్యోగాలను సంపాదించుకునేందుకు వీలు కల్పిస్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో కొత్త అభ్యర్థుల నమోదుకు టాస్క్ వెబ్ సైట్‌లో ప్రత్యేక విండో ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి సుజీవ్‌నాయర్ తెలిపారు. ఒకవేళ ఏదైనా కంపెనీలో భారీస్థాయిలో ఉద్యోగాలుంటే... ఆ పోస్టులకు కంపెనీ ఎలాంటి నైపుణ్యాలు కావాలనుకుంటోందో పరిశీలించి... తమ వద్ద నమోదైన అభ్యర్థులకు వాటిపై ప్రత్యేక శిక్షణ ఇచ్చే అవకాశాన్ని కూడా టాస్క్ పరిశీలిస్తోంది. తద్వారా ఎక్కువమంది ఉద్యోగాలు సంపాదించుకునే వీలుంటుంది.



## అవసరం, అవకాశాల మధ్య వారధిగా ఉంటాం

"ప్రాంగణ నియామకాల తర్వాత కూడా కంపెనీల్లో ఖాళీలుంటాయి. చిన్న, మధ్యతరగతి సంస్థల్లోని ఉద్యోగాల గురించి చాలామందికి తెలియదు. అవి పెద్ద సంఖ్యలోనే ఉంటాయి. వాటన్నింటినీ ఒక్కచోటకి చేర్చి, భర్తీ చేయడానికి టాస్క్ వేదికగా ఉపయోగపడుతుంది. కంపెనీల అవసరాలకు తగ్గ నైపుణ్యాలున్న అభ్యర్థులు దొరకటంలేదు. అవసరం, అవకాశం మధ్య వారధిగా నిలిచి ఉద్యోగాలకు టాస్క్ దారిచూపిస్తోంది. ఎక్కువ సంఖ్యలో ఖాళీలున్నప్పుడు అభ్యర్థులకు స్వల్పకాలిక ప్రత్యేక శిక్షణ కూడా ఇస్తాం"

**- సుజీవ్ నాయర్, సీఈవో టాస్క్**